క్లుప్తంగా

మధుమేహంపై అప్రమత్తత అవసరం



సర్పవరం జంక్షన్‌లో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కుమార్‌యాదవ్

కాకినాడ రూరల్: మధుమేహం పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కుమార్‌యాదవ్ అన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహంపై అవగాహన కల్పించారు. శరీర బరువు తగ్గిపోవడం, బలహీనంగా ఉండడం, త్వరగా అలసిపోవడం, పుండ్లు మానకపోవడం, ఎక్కువ సార్లు మూత్ర విసర్జన వంటివి మధుమేహ లక్షణాలన్నారు. దీనిని అశ్రద్ధ చేస్తే గుండెపోటు, మెదడులో రక్తకణాలు మూసుకుపోవడం, కళ్లు, మూత్ర పిండాలు దెబ్బతినడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు క్విజ్, పాటల పోటీలు

కాకినాడ కల్చరల్: యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎంసీఏ కార్యదర్శి పీజే వీకే గాంధీ తెలిపారు. స్థానిక రామారావుపేటలోని సిటీ టేబర్నికల్ చర్చి ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 6 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులను జూనియర్స్‌గా, 16 నుంచి 30 ఏళ్ల లోపు వారిని సీనియర్స్‌గా పరిగణిస్తామన్నారు. విజేతలకు 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు రమణయ్యపేటలోని బెరాకా బ్లెస్సింగ్ చర్చిలో బహుమతి ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 99635 54688 ఫోన్ నంబరులో సంప్రదించాలని గాంధీ కోరారు.

25, 26 తేదీల్లో మహాసభలు

బాలాజీచెరువు: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 1939లో స్థాపించిన అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర 2వ మహాసభలు ఈ నెల 25, 26 తేదీలలో కాకినాడలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ తెలిపారు. ప్రఖ్యాత జర్నలిస్ట్‌గా, సోషలిస్ట్ నాయకునిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా 14 ఏళ్ల జైలు శిక్ష అనుభవించిన మద్దూరి అన్నపూర్ణయ్య ఆంధ్రాలో ఫార్వర్డ్ బ్లాక్ తొలి అధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. అన్నపూర్ణయ్య కాకినాడ సమీపంలోని కొమరగిరిలో జన్మించారన్నారు. కాకినాడలో జరిగే ద్వితీయ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సూర్యనారాయణ కోరారు.

సేవలను సద్వినియోగం చేసుకోండి


ఆధార్ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం సచివాలయం - 3లో ఆధార్ నమోదు కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే వారికి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామస్తుల నుంచి వస్తున్న అర్జీల వివరాలు తదితర వాటిని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ


ప్రతిభ చూపిన కాకినాడ శ్రీచైతన్య విద్యార్థులు

బాలాజీచెరువు: దేశ వ్యాప్తంగా నిర్వహించిన కాట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని స్కూల్ అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఒలింపియాడ్ పరీక్షలో సత్తా చాటారన్నారు. మొత్తం 4,500 మంది విద్యార్థులకు క్యాష్ అవార్డులు ప్రకటించగా అందులో అత్యధికంగా 2,311 మంది క్యాష్ అవార్డులు (51శాతం), 25 వేల మెడల్స్ ప్రకటించగా అందులో 12,860 (51శాతం) తమ విద్యార్థులు సాధించారని సీమ వివరించారు. ఉత్తరాంధ్ర జోన్ నుంచి 2013 మంది ప్రతిభ కనబరిచారన్నారు. కాకినాడ సాంబమూర్తినగర్ బ్రాంచ్‌లో 41 గోల్డ్‌మెడల్స్, 20 మెరిట్ సర్టిఫికెట్లు, ముగ్గురు నగదు బహుమతి సాధించారని తెలిపారు. విద్యార్థులను ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపాల్ సుల్తానా అభినందించారు.

అభివృద్ధిని వివరిస్తూ.. సమస్యలు ఆలకిస్తూ..

- 22వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, మాజీ మేయర్ శివప్రసన్న


ప్రజలతో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, చిత్రంలో వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న

కాకినాడ: మూడున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ.. ప్రజా సమస్యలను ఆలకించి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటూ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పర్యటన సాగింది. సోమవారం ఆయన స్థానిక 22వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏడీసీ నాగనరసింహారావు, కార్పొరేటర్ ఎంజీకే కిశోర్, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట సాగారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. నవరత్న పథకాల ద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు. నిత్యం ప్రజల కోసమే ఆలోచించే ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పరిపాలించడం ఆంధ్రప్రదేశ్ ప్రజల అదృష్టమన్నారు. సీఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. అటువంటి అభూత కల్పనలు, ఆరోపణలను నమ్మవద్దని, ప్రజల సంక్షేమం కోసం పనిచేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ ఏ డివిజన్‌లో పర్యటించినా సీఎం పరిపాలన పట్ల ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి వద్ద పనిచేసే అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, సంగాని నందం, పేర్ల జోగారావు, కంపర బాబి, కొప్పనాతి సత్యనారాయణ, కర్రి శైలజ, వెలమల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలోనూ సంక్షేమ వసంతం


పెదకొత్తూరులో పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పెదకొత్తూరులో గడప గడపకూ..

కరప: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అన్నారు. సోమవారం పెదకొత్తూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక సంక్షేమ పథకాలతో కన్న కొడుకులా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేలు ఎప్పటికీ మరువలేమంటూ మహిళలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. గ్రామంలోకి రాగానే సర్పంచ్ కొత్త నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా బుజ్జి, చోడిశెట్టి చంటి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కన్నబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ఎవరికి ఎంత ప్రయోజనం చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా అందుకున్న సంక్షేమ పథకాల గురించి చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో కొన్ని ప్రాంతాలలో డ్రైన్లు, రోడ్లు వేయాల్సి ఉందని, త్వరలోనే వాటిని కూడా పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచులు వెలుబంటి సీతారామరాఘవ, పలివెల నాగేశ్వరరావు, వాసంశెట్టి కొండ, నాయకులు పెంకే సత్తిబాబు, మూరా అవినాష్, నున్న వీరబాబు, వజ్రపు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు సుభాష్ చంద్రబోస్


సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నేతాజీకి నివాళి


ఆదిత్య కళాశాలలో బోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బోట్‌క్లబ్: స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర కీలకమైందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ అన్నారు. ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. బోట్‌క్లబ్ వెనుక వీధిలో చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్, కార్యదర్శి సువర్ణరాజు, సభ్యులు చైతన్య, సాయికార్తీక్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి న్యాయవాది రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, రాజా, రాఘవరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ ఎనలేని కృషి చేశారన్నారు.

బాలాజీచెరువు: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు మరువలేనివని ఆదిత్య కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ బ్రిటీష్ వారిని తరిమికొట్టడానికి బోస్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇంగ్లాండ్ వ్యతిరేకులతో కలసి ఐక్య కార్యాచరణ చేశారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నాగశ్రీకాంత్, అధ్యాపకులు హేమశ్రీ, సురేఖ, వంశీ పాల్గొన్నారు.

‘స్పందన’ సమస్యలకు సత్వర పరిష్కారం


స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని సత్వరం పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్దిష్ట వ్యవధిలో వేగంగా పరిష్కరించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఇందుకు అనుగుణంగా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. న్యాయ, ఆర్థిక పరమైన అంశాలు మినహా మిగిలిన వాటిని వేగంగా పరిష్కరిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం చేయండి


తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష, రీసర్వే ప్రక్రియ వేగవంతం చేసి, భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కాకినాడ ఆర్డీవో బీవీ రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానికంగా తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. డివిజన్‌లో అసైన్మెంట్ భూములు గుర్తించి చర్యలు తీసుకోవాలని సకాలంలో రెవెన్యూ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని అన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారి వరహాలయ్య, తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

హౌసింగ్ అధికారులపై ఫిర్యాదు

కాకినాడ సిటీ: సామర్లకోట మండలం పి.వేమవరంలో తన సోదరి పసుపులేటి సుజాతకు చెందిన ఇంటి వద్ద వేరే వ్యక్తిని పెట్టి హౌసింగ్ అధికారులు ఫొటోలు తీసి రుణం ఇచ్చారంటూ మేడిది విఘ్నేశ్వరనాగబాబు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు తన సోదరి ఇల్లును వేరే వ్యక్తి ఇల్లు అంటూ చూపిస్తూ ఆన్‌లైన్‌లో జియో ట్యాగింగ్ చేశారన్నారు. అంతేకాకుండా ఆ వ్యక్తికి రూ. 1.28 లక్షల హౌసింగ్ రుణం కూడా ఇచ్చారన్నారు. సదరు అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నాగబాబు కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కృతికా శుక్లా వారం రోజుల్లో దీనిపై రిపోర్టు సమర్పించాలని, తప్పు చేసిన వారిని సస్పెండ్ చేయాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు.

పార్టీ శ్రేణులే మన బలం

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలిగా శివప్రసన్న


బాధ్యతలు స్వీకరించిన శివప్రసన్నను అభినందిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వైఎస్సార్ సీపీకి పార్టీ శ్రేణులే బలం.. బలగమని, రానున్న 2024 ఎన్నికల్లో విజయం మనదేనని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ నగరాధ్యక్షురాలిగా నియమితులైన మాజీ మేయర్ సుంకర శివప్రసన్న సోమవారం ఉదయం 9.50 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత పూజా కార్యక్రమం నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై శివప్రసన్నను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రం కాకినాడలో పార్టీ అధ్యక్షుని పాత్ర ఎంతో కీలకమన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు చేపట్టే వివిధ కార్యక్రమాలతో పాటు పార్టీ పటిష్టత కోసం నాయకులు, కేడర్‌ను సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. బూత్ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా సమర్థంగా నిర్వహిస్తానన్నారు. ముఖ్యంగా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సిటీ ఎమ్మెల్యేగా ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తిరిగి మళ్లీ అధికారంలోకి రావడమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, త్రిపుర సుందరి ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కవిశేఖర ఉమర్ ఆలీషాకు నివాళి


కవిశేఖర విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత

కాకినాడ రూరల్: కవి శేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా వర్ధంతిని రమణయ్యపేట బోట్‌క్లబ్ ఉద్యానవనం వద్ద సోమవారం నిర్వహించారు. పిఠాపురం విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ప్రస్తుత పీఠాధిపతి సద్గురువు ఉమర్ ఆలీషా సోదరుడు అహ్మద్ ఆలీషా అధ్యక్షతన కవిశేఖర ఉమర్ ఆలీషా విగ్రహం వద్ద వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ తదితరులు హాజరై కవిశేఖర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవిగా డాక్టర్ ఉమర్ ఆలీషా సమాజ హితానికి తోడ్పాడ్డారన్నారు. ఉమర్ ఆలీషా సోదరులు హుస్సేన్ షా, ముస్తఫా పాషా మాట్లాడుతూ పీఠం ద్వారా సర్వమత సమ్మతమైన ఆధ్మాత్మిక సేవలు అందించాలన్నారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, కవి శిరీష, డాక్టర్ నమశ్శివాయ, సత్యనారాయణ, సలాది రమేష్, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మలేసి.. సత్తా చాటి


తమ పెయింటింగ్‌తో విజేతలైన విద్యార్థులు

కాకినాడ రూరల్: విద్యార్థులు పెయింటింగ్ వేసి సత్తా చాటారు. తమలోని ప్రతిభకు పదును పెట్టారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు వలసపాకల గ్రామ కేంద్రీయ విద్యాలయలో సోమవారం పరీక్ష పే కార్యక్రమంలో భాగంగా పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కాకినాడ పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు పోటీలో పాల్గొని పరీక్షల్లో భయం పోగొట్టడానికి ప్రధాని నరేంద్రమోదీ సూచించిన విషయాలకు అనుగుణంగా పెయింటింగ్ వేశారు. ఇందులో 5 ఉత్తమ పెయింటింగ్‌లను న్యాయ నిర్ణేతల కమిటీ ఎంపిక చేసింది. విజేతలకు బహుమతులతో పాటు పాల్గొన్న వారికి ప్రమాణ పత్రం, ప్రధాని మోదీ రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని అందజేశారు. పెద్దాపురం, యానాం నవోదయ, సుభానికేతన్, విద్యాంజలి, కాకినాడ పబ్లిక్ స్కూళ్లు, సర్పవరం, ఏపీఎస్పీ, గైగోలుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు తదితర స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా గాంధీ నగర మున్సిపల్ హైస్కూల్ డ్రాయింగ్ ఉపాధ్యాయుడు తులసీరామ్, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాధామాధవి, రాజీవ్‌గాంధీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సంజయ్ వ్యవహరించినట్టు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.శేఖర్ తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం


కేవీపీఎస్, దళిత సంఘాల ముఖ్య నాయకుల సమావేశం

కాకినాడ సిటీ: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెస్తున్నట్లు ప్రకటించడంపై కేవీపీఎస్, దళిత సంఘాల ముఖ్య నాయకుల సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో కేవీపీఎస్ జిల్లా నాయకుడు కేఎస్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఈ ఆర్డినెన్స్‌ను అసెంబ్లీలో చట్ట రూపంలో ఉన్న లోపాలను సరిదిద్దాలని కేవీపీఎస్, దళిత సంఘాలు డిమాండ్ చేశారు. ముందు సంవత్సరం కేటాయించిన నిధులు ఖర్చు కాకుండా మిలిగిపోయిన వాటిని తదుపరి ఏడాది నిధులతో కలిపే విధంగా చట్ట సవరణ చేయాలన్నారు. దళితపేటలో అనేక గ్రామాల్లో శ్మశానాల సమస్య ఉందని, శ్మశానాలు లేనిచోట ప్రభుత్వమే స్థలం కొని ఇవ్వాలని ఈ నెల 27న జరిగే ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, గుడాల కృష్ణ, తుమ్మల నూకరాజు, రాష్ట్రీయ క్రైస్తవ పరిషత్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాశి బాలయ్య, కేవీపీఎస్ జిల్లా నాయకులు ఎం.రాజశేఖర్. కె.సింహాచలం, టి.సత్యానందం, పిట్టా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి సహకరించండి

కాకినాడ సిటీ: కోటనందూరు మండలం అప్పలరాజుపేట గ్రామ పంచాయతీ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఆ గ్రామ సర్పంచ్ నల్లమిల్లి సూర్యకుమారి గోవింద్ సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతి పత్రం అందజేశారు. కొత్తగా అప్పలరాజుపేట గ్రామ పంచాయతీ ఏర్పడిందన్నారు. దీనికి ప్రభుత్వ భవనాలు ఏమీ లేవని, నూతన భవన నిర్మాణానికి నిధులు ఇప్పించాలని కోరారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా సూచనల మేరకు కలెక్టర్ కృతికా శుక్లాను కలసి వినతి పత్రం అందించినట్లు సర్పంచ్ తెలిపారు.

కలెక్టర్ దృష్టికి రైతుల సమస్య

కాకినాడ సిటీ: ఏలేరు అభివృద్ధి పనులలో భాగంగా పిఠాపురం మండలం గోకివాడ, కోలంక ప్రాంత రైతుల నుంచి 8.56 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వం పేపరు ప్రకటన ఇచ్చిందని, దీనికి సంబంధించి ఎటువంటి అవార్డు ఇవ్వలేదని ఆ ప్రాంత రైతులు అన్నారు. దీనిపై వారు ఎంపీ వంగా గీతతో కలసి కలెక్టరేట్‌లో స్పందనకు వచ్చి కలెక్టర్ కృతికా శుక్లాకు వివరించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి రైతులకు రావాల్సిన ఆర్థిక సహాయం అందించాలని ఎంపీ వంగా గీత కలెక్టర్ కృతికా శుక్లాను కోరారు. రైతుల నుంచి భూమి ఏలేరు అభివృద్ధికి అవసరమని 2017, 2019లో పేపర్ నోటిఫికేషన్ ద్వారా 22 మంది రైతులకు సంబంధించిన భూమి తీసుకుంటున్నట్లు ప్రకటన ఇచ్చారన్నారు. కానీ భూమి ఇప్పటికీ తమ స్వాధీన హక్కు భుక్తంలోనే ఉందని రైతులు వివరించారు. రైతులకు రావాల్సిన అవార్డు ఇవ్వలేదని, పేపరు ప్రకటనలో ఇచ్చిన విధంగా భూములను తగ్గించి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చారని తమ దృష్టికి తేవడంతో కలెక్టర్‌కు వివరించినట్లు ఎంపీ గీత తెలిపారు. దీనిని పరిష్కరించేందుకు కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల మేలు కోసం అనేక సంస్కరణలు తీసుకొస్తున్నారన్నారు. ఎంపీ వెంట ఏలేరు ప్రాంత రైతులు నంద్యాల నాగభూషణం, నంద్యాల వెంకటరావు, మిరియాల చంద్రరావు, పాలింకి అప్పారావు, మిరియాల పేర్రాజు తదితరులు ఉన్నారు.

వీనుల విందుగా గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసురాలు సవితశ్రీరామ్ తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసురాలు సవిత శ్రీరామ్‌చే నిర్వహించిన గాత్ర కచేరీ వీనుల విందుగా సాగింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళా మందిర్‌లో మూడు రోజుల నుంచి సభ 75వ సంక్రాంతి వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ముందుగా జ్యోతిని వెలిగించి వేడుకలు ప్రారంభించారు. సాయంత్రం సవితశ్రీరామ్ (చెన్నై)చే నిర్వహించిన సంగీత గాత్ర కచేరీ అలరించింది. వీరికి వయోలిన్ విద్వాంసుడు కె.వెంకటసుబ్రహ్మణ్యం, మృదంగ విద్వాంసులు బి.శ్రీరామ్, ఘటం విద్వాంసుడు ఎస్.హనుమంతురావు చక్కని సంగీత సహకారం అందజేశారు. కార్యక్రమంలో సభ అధ్యక్షులు నారాయణం మురళీ, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఆర్ఏ రావు, భారతలక్ష్మి, ఎస్‌కేవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ


పోటీలలో ప్రతిభ చాటిన కాకినాడ ప్రో షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు

కాకినాడ రూరల్: కాకినాడ ప్రో షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్ ఆగ్రలో జరిగిన రెండో సాన్సత్‌ఖేల్ జాతీయస్థాయి క్రాస్ బో షూటింగ్ పోటీలలో ప్రతిభ చాటారు. క్రీడాకారులు వేద్ వీక్షిత్, కార్తికేయ, సత్యనారాయణ బంగారు పతకాలు, స్వరూప్ సిల్వర్ పతకం, గెద్ద చందు, సాధికాన్‌లు సీనియర్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఆదివారం కేంద్ర న్యాయ శాఖామంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ చేతుల మీదుగా తమ విద్యార్థులు పతకాలు పొందారని ప్రో షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన షాధిక్‌ఖాన్ తెలిపారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు పందిరిరాట

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు సోమవారం పందిరిరాట వేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఫిబ్రవరి 16 నుంచి 21 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. 16వ తేదీ రాత్రి స్వామివారి కల్యాణం, 18న మహాశివరాత్రి, 19న రథోత్సవం, 21న స్వామివారి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించేందుకు, చలువ పందిర్లు వేయడానికి ముహూర్తపు రాటను వేశామని ఈఓ తెలిపారు. సోమవారం నుంచి ఉత్సవాలకు సంబంధించిన పనులను ప్రారంభిస్తామన్నారు. ఉత్సవాల నిర్వహణపై వచ్చే నెల వివిధ శాఖల అధికారులతో కాకినాడ ఆర్డీఓ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, చందలాడ వెంకట్రావు, నేతల వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.